శ్రీవారి సేవలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

పని గంటల పెంపు నిరసిస్తూ తిరుపతిలో ధర్నా

13 గంటల పనివిధానంపై సిఐటియు ధ్వజం

ప్రజాశక్తి - తిరుపతి, వెంకటగిరి, గూడూరు

రాష్ట్రంలో ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ, 13 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. సిఐటీయూ జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఎనిమిది గంటల పని విధానానికి చట్ట సవరణ చేసి రోజుకు 10 గంటల నుండి 13 గంటల వరకు కార్మికులు పనిచేయాలని కేంద్రం చేసిన నిర్ణయాన్ని రాష్ట్రంలో కూ టమి ప్రభుత్వం అమలుకు ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో చట్టం చేయడాన్ని సిఐటియు ఖండిస్తోందన్నారు. ఎన్నో త్యాగాల ఫలితంగా ఎనిమిది గంటల పని విధానాన్ని కార్మిక వర్గం సాధించుకున్నదని గుర్తు చేశారు. కార్మిక వర్గానికి ద్రోహం చేసే పద్ధతిలో రాష్ట్రంలో కూటమిప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. పని గంటల పెంపు విధానం టీటీడీ, స్విమ్స్, రుయా లో అమలు చేసే ప్రమాదం ఉందని, ఈ ప్రమాదాన్ని కార్మిక వర్గం గుర్తించాలని, కార్మిక వర్గం ఎదురు తిరగాలని పిలుపునిచ్చారు. సిఐటియు నగర అధ్యక్షులు టి సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవ్ కష్ణ మాట్లాడుతూ రాత్రి వేళలో మహిళలు కార్మికులచే డ్యూటీలు చేయించుకోవచ్చునని చేసిన చట్ట సవరణ మహిళా కార్మికులను అవమానపరచడమేనని, మహిళల హక్కులను హరించి వేయడమేనని పేర్కొన్నారు. టీటీడీలో పని గంటలు పెంచితే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు ఎస్. జయచంద్ర, పి.మునిరాజా,పి బుజ్జి, పి. చిన్న, ఎం నరేంద్ర, జి వాసు, దాసు, శ్రీరాములు పాల్గొన్నారు.

- వెంకటగిరిటౌన్‌లో.. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్రమోడీ, చంద్రబాబునాయుడు కార్పొరేట్ల జీతగాడిగా పనిచేస్తూ 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఇది దుర్మార్గమన్నారు. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలన్నారు. 13 గంటల పని విధానం తీసుకొస్తే కార్మికులు బతకాలా, చావాల్నా అని ప్రశ్నించారు. చైనాలో కార్మికుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ఆరు గంటలు మాత్రమే పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డిపల్లి చెంగయ్య, పెంచలయ్య, చిరంజీవి, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో... టవర్‌క్లాక్ సెంటర్‌లో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ధారా కోటేశ్వరరావు, పుట్టా శంకరయ్య, ఎన్‌డి రఫీ, భూలోక మురళి, ఎన్.వెంకటరమణ, గూడూరు మణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పల్లెపాడు, కోటంబేడు భూసమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - బాలాయపల్లి

పల్లెపాడు, కోటంబేడులో భూసమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం బాలాయపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ పల్లెపాడు గ్రామ పరిధి సర్వే నెంబరు 53లో 149 ఎకరాల 50 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, గత 15 సంవత్సరాలు నుండి దళితులు, గిరిజనులు, ఇతర వెనకబడిన సామాజిక తరగతులు ఆ భూముల్లో ఉంటున్నారన్నారు. రెవెన్యూ వారు సర్వే చేసి రెవెన్యూ భూములు అని తేల్చినా, ఫారెస్ట్ వారు అడ్డుపడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఫారెస్ట్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల జోలికి వస్తున్న ఫారెస్ట్ వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పేదల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఫారెస్ట్ వారు దళితులకు అన్యాయం చేసే పద్ధతులు మానుకోవాలని హితవు పలికారు. కోటంబేడు గ్రామంలో

దురాక్రమణకు గురైన దళిత గిరిజన భూములను ఎవరి భూములు వారికి అప్పజెప్తామని గతంలో చెప్పారని అన్నారు. కానీ ఇప్పుడు మాట మార్చి ఆ భూములన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని చెప్పడం అన్యాయం అన్నారు. మండల స్థాయి రెవెన్యూ అధికారులు స్పందించి దళిత గిరిజన భూముల్ని వెంటనే దళితుల గిరిజనులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే బాలయ్యపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, వ్యకాసం నాయకులు రాజగోపాల్, వెంకటరమణయ్య, సుబ్బమ్మ పాల్గొన్నారు.

సిహెచ్‌ఓలకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘీభావం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సిహెచ్‌ఓల నిరసనకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సంఘీభావం ప్రకటించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు కుమార్ మాట్లాడుతూ సి హెచ్ ఓ బదిలీలను ఆపాలని , ఏళ్ల తరబడి వారు పనిచేస్తున్నా పర్మినెంట్ చేయకుండా వారిని ఇబ్బంది పెడుతున్నారన్నారు. బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ చదువుకుని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనే ఉద్యోగానికి వస్తే ఇప్పటికే అనేక యాప్ ల ద్వారా వారికి వర్క్ ప్రెజర్ పెరిగి అల్లాడుతూ ఉంటే, కొత్తగా 'థింక్' అనే ప్రోగ్రాంను తీసుకొచ్చి వారిని జిల్లా కాని జిల్లాలో పనిచేయాల్సింది, లేకుంటే యాక్షన్ తీసుకుంటామని బెదిరించడం సరైంది కాదన్నారు. సిహెచ్‌వోలు మూడు రోజులుగా తిరుపతి డిఎంహెచ్‌ఓ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని రాత్రనకా పగలనకా చేస్తున్నారు. అదే దారిలో వెళుతూ వస్తున్నటువంటి అధికారులు వారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

దసరాకైనా ఉద్యోగులకు డిఎ ఇవ్వాలి : బొప్పరాజు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వ ఉద్యోగులకు డిఎతో పాటు పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే వేయాలని ఎపి జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. మంగళవారం తిరుపతిలోని ప్రైవేట్ హోటల్లో ఉద్యోగులతో సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల డిఎ బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. దసరా పండుగకైనా డిఎ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉద్యోగులు రాత్రనకా పగలనకా పనిచేస్తుంటే వారికి ఎపుడూ ఉన్నతాధికారుల వేధింపులు తప్ప ఏనాడూ వారిని మెచ్చుకున్న సందర్భాలు లేవన్నారు. ముఖ్యంగా కలెక్టర్ రెవెన్యూ అధికారుల పనితీరును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై టార్గెట్లు పెట్టి

ఒత్తిడి పెంచవద్దని సూచించారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో తహశీల్దారులతో సమావేశాలు నిర్వహించామని, తిరుపతి జిల్లాలో చిట్టచివర సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివప్రసాద్, అశోక్‌రెడ్డి, ఎపి జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపినాథ్‌రెడ్డి, తాండాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గాదేవికి ముక్కంటి సారె

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున బుధవారం సారెను అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఈవో బాపిరెడ్డిలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రతి ఏటా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ కు ముక్కంటి తరుపున సారె అందజేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బొజ్జల తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ శుభారంభం

కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పణ

పెద్దశేష వాహనంపై మలయప్ప స్వామి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో వేడుకగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ ఘట్టం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, కంకణ బట్టర్ వేణుగోపాల దీక్షితులు, పాల్గొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, కంకణ బట్టర్ వేణుగోపాల దీక్షితులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి పెద్దశేషవాహనంపై మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శనను, రాంబగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు బుధవారం ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే వార్షిక బ్రహ్మోత్సవాల వైభవాన్ని ఫల, పుష్ప, ఫోటో ప్రదర్శన ప్రతిబింబిస్తోందని తెలిపారు. తిరుమలలో రవాణా, క్యూ లైన్ విధానం, అన్నప్రసాదం, లడ్డు ప్రసాదం పంపిణీ తదితర విశేషాలను తెలియజేసే అరుదైన ఫోటోలు ఆకర్షణగా నిలుస్తున్నాయని అన్నారు. ఆయుర్వేద, అటవీ శాఖ, శిల్పకళాశాల స్టాల్స్‌ను ఆయన అభినందించగా, టీటీడీ పబ్లికేషన్స్, అగరబత్తి స్టాల్‌ను సందర్శించారు.

గార్డెన్ విభాగం రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, సురస, ద్రౌపది స్వయంవరం వంటి పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని చైర్మన్ కొనియాడారు. అదేవిధంగా, బెంగళూరుకు చెందిన కళాకారిణి గౌరి రూపొందించిన సైకత శిల్పంలో ఆనందనిలయ విమాన వెంకటేశ్వరుని మోసుకెళ్తున్న మహాగరుడ రూపకల్పన విశేషంగా ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జనకీదేవి, శాంతారామ్, నరేష్ కుమార్, జంగా కష్ణమూర్తి, చీఫ్ పీఆర్వో డా.టి.రవి, గార్డెన్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాలకు చెందిన వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారికి భారీ బంగారు కానుక

రూ.3.86 కోట్లు విలువైన స్వర్ణ యజ్ఞోపవీతంను శ్రీవారికి కానుకగా వైజాగ్ కు చెందిన హిందుస్థాన్ ఎంటర్ప్రైజ్ ఎండి పువ్వాడ మస్తాన్ రావు, కుంకుమ రేఖ దంపతులు బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అందజేశారు. వీరిని టిటిడి చైర్మన్ అభినందించి, దర్శన ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ కార్పొరేషన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బుధవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మౌర్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా యాత్రికులు తిరుపతి నగరంలో కావాల్సిన మౌలిక సదుపాయాలపై, ఇతర అంశాలపై కంట్రోల్ రూమ్ తెలియజేసేందుకు సిబ్బందిని నియమించారు.కంట్రోల్ రూమ్ నెంబర్ 0877బి2256 766 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని శ్రీవారి భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

దేశంలోనే తొలిసారిగా... తిరుమలలో ఎఐ కమాండ్ కంట్రోల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి దర్శనానికి నిత్యం వచ్చే వేలాది మంది భక్తుల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు టీటీడీ కతిమ మేదస్సును వినియోగించాలని నిర్ణయించుకుంది. ఏఐ టెక్నాలజీ పై ముందు నుంచి ఫోకస్ చేసిన టీటీడీ చైర్మన్ ఎన్‌ఆర్‌ఐల సహకారంతో దేశంలో తొలిసారిగా తిరుమలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 లోని 25 వ నంబర్ కంపార్టమెంటులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా భక్తుల రద్దీ నియంత్రణ, వసతి, భద్రత పెంపొందించేందుకు చర్యలు చేపట్టనుంది. గురువారం ఉదయం సీఎం చంద్రబాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) అందుబాటులోకి వస్తే ఎలా ఉపయోగపడుతుందనే అంశాలను పరిశీలిస్తే.. ఐసీసీసీలో పెద్ద డిజిటల్ స్క్రీన్ పై అన్ని విభాగాలకు చెందిన సీసీ టీవీ పుటేజీలు కనిపిస్తాయి. వీటిని 25 మందికి పైగా సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తూ అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తారు. ప్రస్తుతం ఉన్న వాటితో పాటు కొత్తగా అమర్చిన ప్రత్యేక కెమెరాలతో అలిపిరి వద్ద నుంచే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుంది. క్యూలైన్లలో ఎంతమంది భక్తులున్నారు.. ఎంత సమయంగా వారు నిరీక్షిస్తున్నారు, సర్వదర్శనం పరిస్థితి లాంటి అంశాలను ఏఐ ట్రాక్ చేస్తుంది.

టెక్నాలజీతో క్రైమ్ కంట్రోల్

ఇక ఫేస్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా ఏఐ భక్తులను గుర్తిస్తుంది. చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా కనిపెడుతుంది. తప్పిపోయిన వారు ఎక్కడున్నారో తెలియజేస్తుంది. భక్తుల ముఖ కదలికలు ఆధారంగా వారి ఇబ్బందులు తెలుసు కుంటుంది. క్యూలైన్లు. వసతి ఇతర సౌకర్యాలను వాస్తవ పరిస్థితులతో 3డీ మ్యాప్ లు, చిత్రాలతో చూపుతుంది. రద్దీ ఉన్న ప్రాంతాల్ని రెడ్ స్పాట్లుగా చూపడంతో పాటు వాటి చర్యలకు సంకేతాలిస్తుంది. ఆన్ లైన్ లో నిరంతరం పర్యవేక్షిస్తూ సైబర్ దాడులు, టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతినే సామాజిక మాధ్యమాల్లో పెట్టే అనుచిత పోస్టులు, ఆన్ లైన్ లో తప్పుడు సమాచారాలను ఇది అడ్డుకుంటుంది. ఎప్పటికప్పుడు భక్తుల అనుభవాలు తెలుసుకుని శ్రీవారి దర్శనాన్ని మరింత సౌకర్యవంతం చేసేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. అలాగే అత్యవసర పరిస్థితుల్లో భక్తులను బయటకు తీసుకొచ్చే సమీప మార్గాలను ఇది చూపుతుంది.

నేడు 'వెంకటాద్రి' పిఎసి-5' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు రోజూ కొండకు చేరుకునే భక్తుల సంఖ్య దాదాపు 90 వేలకు చేరుకుంది. తిరుమలలో 45 వేల నుంచి 50 వేల మంది భక్తులకు మాత్రమే కొండపై వసతికి అవకాశం ఉంది. సామాన్యుడు నుంచి సంపన్నుడు వరకూ తిరుమలలోని అతిథి గహాలు, యాత్రికుల వసతి సముదాయాలు, మఠాల్లో సేద తీరుతున్న పరిస్థితి ఉంది. అయినా రద్దీ రోజుల్లో గదులు దొరకని పరిస్థితి. దీంతో కొండకు చేరే భక్తులకు వసతి సమస్యను తీర్చే ప్రయత్నంలో అదనపు వసతి కోసం 'పీఏసీ ఐదు' నిర్మాణాన్ని అదనపు వసతి కోసం నిర్మించారు. 2018లో రూ. 102 కోట్లతో యాత్రికుల వసతి సముదాయం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 2,69,617 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు అంతస్తుల భవన నిర్మాణాన్ని రెండు బ్లాక్‌లుగా పూర్తిచేసింది. ఇందులో 16 డార్మెంటరీ హాల్స్ తోపాటు 2500 లగేజీ లాకర్లు అందుబాటులోకి తెచ్చింది. 216 మరుగుదొడ్లు, 216 స్నానపు గదులను నిర్మించింది.

ప్రతి అంతస్తులోనూ రెండు చోట్ల ఆర్వో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తెచ్చింది. తిరుమలలోని ఆర్టీసీ బస్టాండుకు దగ్గరగా భక్తులకు అందుబాటులో ఉండేలా పీఏసీ-5ను నిర్మించింది. దాదాపు నాలుగు వేల మంది భక్తులకు వసతి కల్పించేలా వెంకటాద్రి నిలయం అందుబాటులోకి తెచ్చిన టిటిడి ఈనెల 25న బ్రహ్మోత్సవాల్లో సీఎం చేతుల మీదుగా ప్రారంభించబోతోంది. మరోవైపు వెంకటాద్రి నిలయంలో చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది, దాదాపు 1500 మంది భోజనం చేసే విధంగా రెండు డైనింగ్ హాల్స్ ఉన్నాయి. ప్రాథమిక చికిత్స కేంద్రాలు, కళ్యాణకట్ట అన్నప్రసాద వితరణ కేంద్రాలు లాంటి సదుపాయాలతో పాటు భక్తుల్లో ప్లాస్టిక్ వాడకం నిషేధమన్న విషయంపై అవగాహన కల్పించబోతోంది.

బ్రాహ్మణికి స్వాగతం పలికిన రిషిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి బుధవారం స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రాహ్మణి తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకోగా రిషితా మర్యాదపూర్వకంగా కలిసి కాలంకారీ వస్త్రాన్ని, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

'కొట్టే' దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'కష్టపడే వ్యక్తిత్వం కలవాడు జనసేన నేత కొట్టే సాయి' అని టీడీపీ బీసీ విభాగం తొట్టంబేడు మండల అధ్యక్షులు సురేంద్ర యాదవ్ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా కొట్టే సాయి నియామకం కావడం పట్ల బుధవారం ఆయన్ను సురేంద్ర యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొట్టే దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని కొనియాడారు.

గాయత్రీదేవి అలంకారంలో గంగమ్మ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం తాతయ్యగుంట గంగమ్మ తల్లి గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గాయత్రి దేవి హోమం సాంప్రదాయబద్దంగా జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సతీమణి సత్యవతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయపాకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

అల్పాహారం వితరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో గర్భిణుల సహాయకులకు బుధవారం ఉదయం ఉచితంగా అల్పాహార వితరణ చేశారు. అనంతరం 75. మందికి ఉచితంగా బిపి, షుగర్ టెస్టులు నిర్వహించారు. అల్పాహార దాత మహాలక్ష్మి సాఫ్ట్ టాయ్స్ అధినేత సి. రంచోదరం చౌదరి, రీజియన్ చైర్మన్ లయన్ మక్కిన భాస్కర్, అధ్యక్షులు లయన్ బండి మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లయన్ జి శంకర్, కోశాధికారి లయన్ వి పురుషోత్తమ నాయుడు, సభ్యులు లయన్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల ఆధార్ అప్డేట్‌కు

రోజుల తరబడి నిరీక్షణ

సగం మంది ప్రభుత్వ పథకాలకు దూరం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ఎంతోకాలంగా ఆధార్‌కార్డు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న గిరిజనులకు స్పెషల్‌డ్రైవ్‌గా ఆధార్ కార్డు క్యాంపులను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. బుధవారం వరదయ్యపాలెం సచివాలయం -2లో ఆధార్ అప్డేట్ క్యాంపు ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తులో తహశీల్దార్ సంతకం లేని కారణంగా గిరిజనులకు ఆధార్ నమోదు చేసే ప్రక్రియ నిలిచిపోయింది. విచారించగా తహశీల్దార్ వేరే పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని సమాచారం. దీంతో ఆధార్ అప్డేట్ కోసం కేంద్రం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మండలంలో 1300 మంది గిరిజనులు ఉండగా, దాదాపు 700 మందికి ఆధార్‌కార్డులు లేని పరిస్థితి.

వరదయ్యపాలెం మండల పరిధిలో దాదాపు 20 పైగా గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. గోపాలపురం కాలనీ, హైస్కూల్ సెంటర్, అనీల్‌సెంటర్, రామిరెడ్డిపాలెం, కాంబాకం, జి.ఆర్ దరఖాస్తు, అంబూరు, శాతంబేడు, తాగేలి, సిఆర్‌సి కండ్రిగ, బత్తులవల్లం, కాంబాకం, కంచరపాలెం, పాండూరు, వికెఆర్‌వై కాలనీ, చెన్నవారిపాలెం తదితర 20 సెంటర్లలో ఆధార్ అప్డేట్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ ఆధార్ పొందని 17 ఏళ్ల లోపు వారికి, కొన్ని కారణాలతో ఆధార్ పోగొట్టుకున్న వారికి ఈనెల 22 నుంచి 27 వరకూ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుల వరకూ ఈ సమాచారాన్ని స్థానికంగా ఉన్న గిరిజనులకు అందజేసి ఈ క్యాంపులను విజయవంతం చేయాలన్నది లక్ష్యం. అయితే అధికారుల సమన్వయ లోపంతో గిరిజనులు రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి.

అధికారుల్లో సమన్వయ లోపం

గిరిజనులకు ఆధార్ సంబంధించి ఎటువంటి సమస్యలైనా పరిష్కరించడానికి మండలంలో వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్యాంపులను ఏర్పాటు చేశారు. ఎక్కువమంది గిరిజనులకు ఆధార్ కార్డులను అందించాలనే ధ్యేయంతో గిరిజన సంక్షేమ శాఖ ఈ క్యాంపులను ఏర్పాటు చేసింది. వరదయ్యపాలెం మేజర్ పంచాయతీలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్యాంపు ఏర్పాటు చేసిన తేదీ కంటే ముందు రోజే ఆధార్‌కార్డు అప్డేట్ కోసం కావాల్సిన అన్ని పత్రాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుంటే క్యాంపు రోజు త్వరగా పని పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అలాకాకుండా సచివాలయ సిబ్బంది క్యాంపు

ఏర్పాటు చేసిన రోజే సంబంధిత పత్రాలను ప్రింట్ చేయడంతో తహశీల్దార్ అందుబాటులో లేక ఆధార్ ఇవ్వలేదని తెలుస్తోంది. సచివాలయ సిబ్బందికి, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపంతో సామాన్య గిరిజనులు దినసరి కూలిని వదులుకుని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆధార్ లేని కారణంగా సంక్షేమ పథకాలు అందడం లేదని, రోజువారి కూలి పనులకు వెళ్లే తామకు ఆధార్ కార్డులు ఇచ్చి పింఛన్, రేషన్‌కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

గిరిజనులు అందరికీ ఇవ్వాలి
దాసరి జనార్ధన్, సిపిఎం

ఆధార్ కార్డు లేక గిరిజనులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉంది. యుద్ధప్రాతిపదికన ఈ స్పెషల్ క్యాంపులో గిరిజనులు అందరిని రప్పించి ఆధార్ కార్డులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

అందుబాటులోనే ఉన్నా : సుధీర్‌రెడ్డి, తహశీల్దార్

ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నా. సకాలంలో అందరి పనులు పూర్తయ్యేలా చూస్తున్నా. బుధవారం ముఖ్యమైన పనిమీద కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడంతో కొంత గందరగోళం ఏర్పడిన మాట వాస్తవం. గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తా. ఆధార్‌కార్డులు అందేలా చర్యలు తీసుకుంటాను.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -వాకాడు: వాకాడు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొండూరు, దుగరాజపట్నం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జునసాగర్ ని విత్తన శుద్ధి, నానో యూరియా, డిఏపి, జీవన ఎరువులు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు, వాకాడు ఏఎంసీ వైస్ చైర్మన్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి దీప, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- వాకాడు: వాకాడు నూతన ఎంపీడీవోగా సాయి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూర్వపు ఇన్‌చార్జి ఎంపీడీవో, ఏవో శ్రీనివాసులు ఎంపీడీవో సాయి ప్రసాద్‌ను, కార్యాలయ సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ మండలాన్ని అందరి సమిష్టి కృషితో వాకాడు మండలాన్ని అన్ని విభాగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ ఆర్ అనంతపురం పంచా యి తీలో ఉపాధి హామీ పనులలో భాగం గా చేపట్టిన ఫారం పాండ్ ... బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో మోతి ... పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్లు తవ్వు కోవడం వల్ల భూగర్భజలాలు వృద్ధి చెందడమే కాకుండా, భూమి పొరల్లో వల్ల పంటకు మేలు చేసే మిత్ర పురుగుల వృద్ధి చెందుతున్నాయని. నిర్ణయించిన కొలతలతో పనిచేసే ఉపాధి పొందాలన్నారు. హాజరులో వంద శాతం పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రతీ రోజూ గ్రామ స్థాయి క్షేత్రస్థాయి ఫోటోలను మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించి తప్పులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్ట్ సంచాలకులు డి సరిత, అదనపు కార్యక్రమాధికారులు, అవిలాల దేవర, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ భాను శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు రవీంద్రుడు, మధుసూదన్ వెంకటయ్య, మాధవి, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మోతి

పోషక మాసోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు పంచాయతీ లోని తిరువెంగళాయపల్లి అంగన్ వాడీ కేంద్రంలో 8 వ రాష్ట్రీయ పోషక మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారి మెహబూబీ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లి పాలే బిడ్డకు శ్రీ రామ రక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చెంచు లక్ష్మీ , పద్మశ్రీ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'ప్లాస్టిక్ నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..' అని మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత హి సేవను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం, ఇంటి వద్దే వ్యర్థాల ఏరివేతపై వినూత్నంగా ఆలోచించేలా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూ.5 వేలు నుండి రూ.25 వేల వరకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఈ లోకేష్, ఏఈలు కార్తీక్, రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, స్టాఫ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండల పరిధిలో బాధిత లబ్ధిదారులకు

మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను శ్రీకాళ హస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి బుధవారం స్వయం గా వారి ఇళ్ల కు వెళ్లి అందించారు. మొత్తం మంజూరైన రూ.4,79,050 చెక్కులను 10 మంది బాధితులకు ఇచ్చారు.

సమాజసేవే నిజమైన విద్య: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సమాజ సేవ ద్వారా నిజమైన విద్యను పొందవచ్చని, ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు సేవాభావం ఏర్పడుతుందని డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ యువత సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి కే శ్రీనివాసులు, డాక్టర్ సి వెంకట కృష్ణయ్య, డాక్టర్ ఎం శ్రీనివాసులు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల: స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి హరినాథ చారి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ఆఫీసర్ మునిరాజా, అధ్యాపకులు వంగల్ రాజా, గీతాంజలి, శ్రీనివాస ప్రసాద్, షరీఫ్, బాలు, ఆనంద్ , గిరిజన , మోహనరంగా, చలపతిరెడ్డి , విజయనిర్మల, పద్మజ ,రూప పాల్గొన్నారు.

బాలాయపల్లి: వెంగమాంబా పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి కళాశాల ప్రిన్సిపాల్ కరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావం అలవరచు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, లెక్చరర్లు, ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో మల్లీశ్వర, జి సుబ్రహ్మణ్యం , శ్రీకృష్ణ భార్గవి, ఏవి.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా సమావేశమైన దృశ్యం

చంద్రగిరి: చంద్రగిరి మండలంలోని ఎంపీడీవో వారి జిఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బందికి పి 4 ఓరియంటేషన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. లబ్ధిదారులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న సమాచారంతో పాటు సర్వే గ్రామసభల ద్వారా గుర్తించాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె వెంకటరత్నం, ఎ శేఖర్ , యంగ్ ప్రొఫెషనల్ బి.నవీన్ కుమార్, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం!

- మరుగుదొడ్లకు తాళాలు
- చెట్ల కిందే ప్రయాణికులు
- ఇదీ పుత్తూరు రైల్వేస్టేషన్ దుస్థితి

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పుత్తూరు రైల్వేస్టేషన్‌పై ఆ శాఖ అధికారులు శీతకన్ను చూపుతున్నారు. నగరి మండలం వెంకటనరసింహ రాజుపేట నుంచి పూడి వరకు దక్షిణ మధ్య రైల్వే వుంది. పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వస్త్ర వ్యాపారులు చెన్నై, హైదరాబాద్, ముంబయి వంటి ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో అసౌకర్యాల మధ్య రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో దక్షిణ రైల్వే అధికారులు తనిఖీ చేసిన సమయంలో ఆదర్శ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చెన్నై నుంచి తిరుత్తణి వరకు యూనిట్ రైళ్లు వస్తున్నాయి. వాటిని రేణిగుంట వరకు పొడగించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులు కోరుతున్నా ఆ శాఖ అధికారులు పెడచెవిన పెడుతున్నారు. యూనిట్ రైళ్లు పొడిగిస్తే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది.

ప్రధాన నగరాలైన ముంబయి, చెన్నై, హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు పుత్తూరు రైల్వే స్టేషన్లో ఆగుతుంటాయి. ఒక్క దురంతో ఎక్స్ ప్రెస్ మాత్రం ఆగడంలేదు. రైల్వే బోగీల డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల వికలాంగులు స్టేషన్లోకి వెళ్లేందుకు వృద్ధులు, పెద్దలు వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం, ర్యాంపు మాత్రం ఏర్పాటు చేశారు. కనీసం చక్రాల సైకిళ్లు మాత్రం లేవు.

మరుగుదొడ్డికి తాళం

మరుగుదొడ్లు వున్నా వాటికి తాళాలు వేశారు..ఈ కారణంగా ప్రయాణికులు కాలకృత్యాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మరుగుదొడ్లకు తాళం వేసిన దృశ్యం

షెల్టర్లు పూర్తి స్థాయిలో లేవు

ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో షెల్టర్లు లేవు. దీంతో చెట్ల కింద ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీటి కుళాయిలు సక్రమంగా ఏర్పాటు చేయలేదు. నీరంతా వృథాగా పోతోంది.

- జయరాములు, పుత్తూరు.

చెట్ల కిందే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చెట్ల కిందే ప్రయాణికుల నిరీక్షణ

పుత్తూరు రైల్వేస్టేషన్‌లో కుర్చీలు కూడా లేకపోవడం గమనార్హం. వివిధ ప్రాంతాల నుంచి శల్యవైద్యం కోసం వస్తుంటారు. కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కిందే గంటలు తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఆదాయం వున్నా సౌకర్యాలు సున్నా..

పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి నిత్యం 150-200 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో ఏటా రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. అయినా సౌకర్యాలు మాత్రం శూన్యం..

- రాజేంద్ర, గేటు పుత్తూరు.

రూ.7 వేలు పింఛను ఇవ్వాలి

డప్పు కళాకారుల సంఘం డిమాండు

ప్రజాశక్తి -నాగలాపురం: డప్పు కళాకారులకు నెలకు 7 వేల రూపాయల పింఛను ఇప్పించాలని డప్పు కళాకారుల సంఘం నాయకులు డిమాండు చేశారు. నాగలాపురం మండల డప్పు కళాకారుల సంఘం ప్రథమ మండల మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య, మండల అధ్యక్షులు టి మురళి అధ్యక్షతన నాగలాపురం హెచ్‌పి పెట్రోల్ బంక్ నుండి ఊరేగింపుగా బయలుదేరి బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి డప్పు వాయిద్యాలతో డప్పులు వాయిస్తూ వెళ్లి నాగలాపురం మండల ఎంపీడీవోకు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెన్షన్ రూ.4వేల నుండి రూ.7 వేలకు పెంచాలని, ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇవ్వాలని, జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. మండల అధ్యక్షులు టంగుటూరి మురళి మాట్లాడుతూ కలెక్టర్ గ్రౌండ్ అకౌంట్స్ నిధుల నుండి డప్పు కళాకారులకు డ్రస్సులు, గజ్జెలు కొనడానికి నిధులు మంజూరు చేయాలని , గుర్తింపు కార్డు కలిగిన డబ్బు కళాకారులకు బస్సుల్లో, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ ఎటువంటి నిబంధనలు లేకుండా అర్హులైన డప్పు కళాకారులు అందరికీ సెల్ఫ్ డిక్లరేషన్‌తో పాటూ గ్రామ సచివాలయాల్లో పింఛను మంజూరు చేయాలని. ప్రమాదంలో మరణించిన ప్రతి డప్పు కళాకారునికి ప్రభుత్వం 10 లక్షలు మంజూరు చేయాలని సహజంగా మరణించిన వారికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ భాస్కర్, ముత్తు, పరంధామయ్య, దయాలన్, రాజా, అయ్యప్ప, మహేంద్ర, రవి, చిరంజీవి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న డప్పు కళాకారులు

సర్వేచేసి గిరిజనుల పొలాన్ని కాపాడాలి

- యానాదుల సంక్షేమ సంఘం వినతి

వినతిపత్రం అందిస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: బాలాయపల్లి మండలం పెరిమిడి గిరిజన కాలనీ వాసుల పొలాన్ని జాయింటు సర్వే చేసి కాపాడాలని తిరుపతి జిల్లా యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున రావు తహశీల్దారుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిమిడి గిరిజనులకు సిజెఎఫ్ఎస్ కింద ప్రభుత్వం భూమి మంజూరు చేసిందని, ఈ భూమిని గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ప్రస్తుతం ఫారెస్ట్ అధికారులు ఇది ఫారెస్ట్ భూమి సాగు చేసుకోవడానికి వీల్లేదని అడ్డు కుంటున్నారన్నారు. పెరిమిడి గ్రామంలో తలారిగా పనిచేస్తున్న శారద గిరిజనులను మభ్యపెడుతూ దౌర్జన్యం చేస్తూ గిరిజనుల పొలాన్ని ఆక్రమించుకుని బెదిరిస్తున్న తలారి శారదాపై చర్యలు తీసుకోవాలని తహశీల్దాను కోరారు. ఫారెస్ట్ , రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించి గిరిజనుల పొలానికి హద్దులు చూపాలని కోరారు. స్పందించిన తహశీల్దారు త్వరలోనే జాయింట్ సర్వే నిర్వహించి పెరిమిడి గిరిజనుల పొలాలకు హద్దులు వేసి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు అట్రాసిటీ డివిఎంసి సభ్యులు మోపూరు అడివయ్య, పెరిమిడి గిరిజనులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతకే పి4: ఎంపీడీవో

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: వర్గాలకు ఆర్థికంగా చేయూత అందించి వారి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకే ప్రభుత్వం పి 4 విధానం అమలుకు శ్రీకారం చుట్టిందని బిఎన్‌కండ్రిగ ఎంపీడీవో మోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిధిలోని ఎంపీడీవో భవనంలో పరిపాలన అధికారి పర్యవేక్షణలో పి ఫోర్ అమలు, స్వచ్ఛతహిసేవ ప్రత్యేక డ్రైవ్‌పై పంచాయతీ సెక్రటరీలు,సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సర్వే ద్వారా అధికారులు గుర్తించిన 2 వేలకు పైగా బంగారు కుటుంబాలను ప్రవాసాంధ్రులు, వివిధ వర్గాల సంపన్నులు దత్తత తీసుకొని వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలని ఆయన ఆయన పిలుపునిచ్చారు.గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా దృష్టి సారించాలన్నారు. దీంతోపాటు తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలు ఉంటే అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ఈవో ఈశ్వర ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ ఈ నాగరాజు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకాడులో

వాకాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వాకాడులో ఎంపీడీవో సాయి ప్రసాద్ అధ్యక్షతన పి4 పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ట్రైనర్ గా హుస్సేన్ బాష(పంచాయతీ కార్యదర్శి) వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాలను దత్తత ద్వారా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దారు ఇక్బాల్, ఏవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పి 4 పై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపిడిఓ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికం నిర్మూలన కోసం పి4 ను ప్రవేశపెట్టిందని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సివి ఏపీ గూడూరు కో ఆర్డినేటర్ వినయ్ పాల్గొన్నారు.

25 వేల ఇంటర్వెన్షన్లు విజయవంతం

స్విమ్స్ కార్డియాలజి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ డి రాజశేఖర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్విమ్స్ కార్డియాలజి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నాటికి ఇరవై ఐదు వేలు ఇంటర్వెన్షన్లు విజయవంతంగా నిర్వహించామని స్విమ్స్ కార్డియాలజి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ డి రాజశేఖర్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్ నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన 61 సంవత్సరాల యాత్రికుడు, ఛాతి నొప్పితో తిరుమల అశ్విని హాస్పిటల్ నుండి స్విమ్స్ రెఫర్ అయి, స్విమ్స్ కార్డియాలజి విభాగంలో అడ్మిట్ అయ్యి ప్రొసీజర్ చేసుకున్నారు. ఈ ప్రొసీజర్ తో కలిపి స్విమ్స్ కార్డియాలజి విభాగంలో 25,000వ కేసుగా పూర్తి చేశామని తెలిపారు. 1993లో ఫిబ్రవరిలో స్థాపించిన స్విమ్స్ కార్డియాలజి విభాగంలో క్యాథ్ ల్యాబ్ అక్టోబర్ 1993లో ప్రారంభించారు. ఫిబ్రవరి 1994లో మొదటి ఇంటర్వెన్షన్ ప్రొసీజర్ ముగిసింది. అందులో 3000 కు పైగా ప్రాథమిక పిసిఐలు నిర్వహించారు. 1994లో పరిసర 4 జిల్లాల్లో ఇలాంటి ఇంటర్వెన్షన్ చేసిన తొలి హాస్పిటల్ గా స్విమ్స్ నమోదు అయిందన్నారు. ఇతర ప్రయివేటు ఆసుపత్రులు సైతం దీన్ని సాధించలేక పోయాయన్నారు. ఇలాంటి ప్రొసీజర్లలో ఇతర ఆసుపత్రులతో పోల్చుకుంటే స్విమ్స్ హాస్పిటల్ 1 శాతం కంటే మరణాల రేటు తక్కువగా ఉంది. ఈ సందర్భంగా డాక్టర్ డి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన ఫ్యాకల్టీ, రెసిడెంట్లు, టెక్నిషియన్లు, నర్సులు, ప్రోగ్రామ్ అసిస్టెంట్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

- డాక్టర్ చంద్రశేఖర్


మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని పుత్తూరు ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ఉచిత ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. డిబిఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిం చారు. కార్యక్రమంలో హెచ్ డి ఎస్ కమిటీ మెంబర్స్ అశోక్, మధు, మోహన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ జె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హనా అంజుం, డాక్టర్ అశోక్ వర్ధన్ కుమార్ , డాక్టర్ సురేష్ , డాక్టర్ పల్లవి , డాక్టర్ సస్య శ్రీ, డాక్టర్ ప్రకాష్ రావు, హెడ్నర్స్ రమా గౌరి , ఫారెన్సిస్ట్ శ్రీ అన్నాదొరై, టీబీ యూనిట్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది అన్నా దొరై, డాక్టర్లు ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్వియూలో పరిశోధక ప్రయోగశాల నిర్మాణం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రూసా ఫేజ్ 2.0లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద కొత్తగా మంజూరైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రయోగశాలలకు విశ్వవిద్యాలయం అధికారులు బుధవారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ రూసా ఫేజ్-2 కింద రకరకాల పరిశోధనాత్మక కార్యక్రమాలు చేపట్టామని, రీసెర్చ్ ప్రయోగశాల కోసం మొత్తం ప్రాజెక్ట్ వ్యయం కింద 6 కోట్ల రూపాయలు వెచ్చించామని, ఈ పనులు తిరుపతిలోని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్నామని అన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, సహకార ప్రాజెక్టుల నిర్వహణకు, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి, అత్యాధునిక సౌకర్యాలను అందించడానికి ఇలాంటి ప్రయోగశాలలు ఉపయోగపడతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య నరసింహ, ఆచార్య బాలాజీ , ప్రిన్సిపాల్స్ ఆచార్య పద్మావతి, భాస్కర్ రెడ్డి, రూసా సిఇఓ వంశీ, ఇంజనీర్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

పరకామణి దొంగలను కఠినంగా శిక్షించాలి: కాంగ్రెస్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీలకు పాల్పడ్డ ఓ మఠం ఉద్యోగిని కాపాడటానికి నిబంధనలను, చట్టాలను అతిక్రమించిన అప్పటి టీటీడీ లోని పెద్దలు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలని లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయంలో, స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను ఒక మఠం ఉద్యోగి, 15 ఏళ్లుగా దోచుకుంటుంటే టీటీడీ విజిలెన్స్ విభాగం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలో గతంలో భూ దందాలు, దౌర్జన్యాలు భారీగా జరిగాయని వీటిని పట్టించుకోవాల్సిన కూటమి నేతలు ఆ విషయాన్ని పక్కన పెట్టి కబ్జాదారులతో చేతులు కలిపిన కొందరు తాము కూడా దందాలు చేస్తు దోచుకుంటున్నారని ఆరోపించారు. సీఎం దీనిపై దృష్టి సారించాలని కోరారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న సీఎం పరకామణి చోరీపై తన నిర్ణయం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

అలా వదిలేస్తే ఎలా..?

మున్సిపల్ స్థలాల్లో పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ వ్యాప్తంగా ఉన్న పలు మున్సిపల్ స్థలాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పలు స్థలాలు దురాక్రమణకు గురవుతుండగా, మరి కొన్ని పిచ్చి మొక్కలు మొలిచి పాములు, విష కీటకాలకు నెలవుగా మారుతున్నాయి. పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ పక్కనే ఉన్న ఓ మున్సిపల్ స్థలంలో గతంలో అధికారులు పచ్చదనం పెంపు కోసం పూల మొక్కలు నాటారు. వాటి బాగోగులు పట్టించుకోకపోవడంతో అనతికాలంలోనే ఎండి అదశ్యమైపోయాయి. దశబ్దాలు గడుస్తున్నా ఇటు వైపు మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలు మొలిచి అందవిహీనంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ స్థలంలో పచ్చదనం పెంపొందించకుంటే భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

ఉద్యోగుల సమస్యలపై మౌనం తగదు..

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వహించడం సరికాదని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ జగన్నాధం పేర్కొన్నారు. బుధవారం తిరుపతిలోని ఎస్టీయు భవనంలో నిర్వహించిన ఒక సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఏమాత్రం ఉపాధ్యాయుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును విస్మరించి, మౌనం వహించడం సరికాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో అక్టోబర్ ఏడవ తేదీన ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విజయవాడలో నిరసన చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయవాణి సంపాదకవర్గ సభ్యుడు జి.గురుప్రసాద్, డివిజనల్ కన్వీనర్ సి వాసు పాల్గొన్నారు.

విసిని కలిసిన బిఎంఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఇన్‌చార్జీ విసి ఆచార్య అప్పారావును నూతనంగా ఎన్నికైన బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ నూతన కార్యవర్గాన్ని గుర్తించి ఉద్యోగుల సమస్యలు, సమావేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చీఫ్ కోఆర్డినేటర్ చింతమాకుల పుణ్యమూర్తి కోరారు. బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్య క్షులు ప్రొఫెసర్ పిసి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎం బాలాజీ మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రాధాన్యతను కాపాడే విషయంలో రాజీ పడబోమని గౌరవాన్ని ఇనుమడింప చేస్తామని పేర్కొన్నారు. సమస్యలు తమ దృష్టికి తీసుకుని వస్తే చట్టం ప్రకారం వారికి న్యాయం తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు సంగీతం సుబ్రమణ్యం, జనరల్ సెక్రెటరీ ఎం పద్మనాభం, సంయుక్త కార్యదర్శులు కె కృష్ణ కుమార్, రఘురాములు, రాజేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఘాట్ రోడ్డు లోయలో పడ్డ లారీ

ఇద్దరికి గాయాలు

లోయలో పడ్డ లారీ

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి పరిధిలో తిరుపతి మదనపల్లి జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్ లో రోడ్డులో లారీ (ఈచర్ వాహనం) అదుపు తప్పి లోయలో పడ్డ ప్రమా దం లో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. తిరుపతి -పీలేరు -మదన పల్లి జాతీయ రహదారి చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో అదుపుతప్పి ఈచర్ వాహనం లోయలో పడడంతో డ్రైవర్ వంశీ, క్లీనర్ శ్యామ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం నుంచి దోసకాయల లోడ్ తో లారీ తిరుపతికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని 108 ద్వారా తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి చెందిన సంఘటన బుధవారం పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు.. బెంగుళూరులోని కెంపెగౌడనగర్‌కు చెందిన కృష్ణా (39) పెయింటింగ్ కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పలువురు కూలీలతో కలిసి పట్టణంలోని ఏరియా ఆస్పత్రి మార్గంలో ఉన్న సిమెంట్, స్టీల్ దుకాణానికి పెయింటింగ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

స్వచ్ఛ తిరుపతికి సహకరించండి

- డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి తిరుపతి టౌన్: స్వచ్ఛ తిరుపతి సాధనకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక సిఎల్‌సి కార్యాలయంలో గాంధేయవాద సంస్థ, ఐటిసి సంస్థ స్వచ్ఛ మిత్రులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య మాట్లాడుతూ స్వచ్ఛ తహి సేవ కార్యక్రమాల్లో భాగంగా నగరంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి నగరాన్ని స్వచ్ఛ తిరుపతిగా మార్చేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. చెత్తను విధానంగా మార్చుకుని, వ్యర్థాలు లేకుండా చూడాలని ఐటీసీ ఉమాకాంత పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజీఎస్ అశోక్ కుమార్, హేమమహేశ్వరి, కుమారి, మెప్మా కృష్ణ వేణు, సోమకుమార్ పాల్గొన్నారు.

'స్మార్ట్ ఇండియా హాకథాన్ 2025' విజయవంతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర (డీమ్డ్-టు-బి యూనివర్సిటీ) స్మార్ట్ ఇండియా హాకథాన్ 2025 లో భాగంగా 24 గంటల హ్యాకథాన్‌ను విజయవంతంగా నిర్వహించింది. 'సమాధాన్ - సమస్యలు స్ఫూర్తినిచ్చే ఆలోచనలు , పరిష్కారాలు' అనేపేరుతో ఐఐసిసి, ఏసిఐసి, ఏఎస్ఐసి తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులలో నూతన ఆవిష్కరణలు , సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం ఈ హాకథాన్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ హ్యాకథాన్ విజయానికి ప్రొఫెసర్ జి ప్రణయ్ కుమార్, సిబ్బంది డాక్టర్ జెవైఎన్ నాయుడు విశేష కృషి చేశారు. వీరికి డాక్టర్ వంకి పెంచలయ్య, చైర్మన్, కళాశాల యాజమాన్యం మద్దతుగా నిలిచారు.

పింఛను పెంచండి..

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగి వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు వృద్ధాప్య పింఛన్ల కంటే కూడా తక్కువ పింఛన్ల డబ్బుతో దుర్భర జీవితం గడుపుతున్నారని విశ్రాంత ఆర్‌టిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు జీవితకాలం శ్రమించి ఆర్టీసీ అభివృద్ధికి సేవలందించిన ఉద్యోగులు నేడు కేవలం మూడు వేల రూపాయల పింఛన్లతో భారమైన జీవితం గడుపుతున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో వచ్చే రోగాలకు కూడా ఈ పింఛన్లు సరిపోవడం లేదని వాపోయారు. రాష్ట్రంలో తమలాంటి విశ్రాంత ఉద్యోగులు అనేకమంది దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని వివరించారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నడిపే కూటమి ఈ దుస్థితిని గుర్తించి, ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లతో సమానంగా కనీసం నాలుగు వేల రూపాయలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సెలూన్ షాప్ ప్రారంభించిన తుడా ఛైర్మన్

ప్రజాశక్తి -రేణిగుంట: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది వన్ అండ్ ఓన్లీ సెలూన్ షాప్ ను తుడా ఛైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి శ్రీకాళహస్తి శాసనసభ్యులు సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి తో కలసి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గోపాలకష్ణ, లవకుమార్ రెడ్డిలు అతిథులను ఘనంగా ఆహ్వానించి సత్కరించారు.

తపాలా జీవిత బీమాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ గురించి ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ ముఖ్యంగా గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. స్థానిక పోస్టాఫీసు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ ర్యాలీలో పోస్టల్ ఉద్యోగులు, ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు చేతిలో ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ బీమా పథకాల ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. పోస్టల్ జీవిత బీమా అందించే తక్కువ ప్రీమియం, అధిక బోనస్, ప్రభుత్వ హామీ వంటి ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు. మరిన్ని వివరాలను తెలుసుకోవడానికి సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించమని తెలిపారు.

తిరుపతి కన్స్యూమర్ డిప్యూటీ కమీషనరు II
చిత్తూరు - తిరుపతి
E.A.NO. 29 / 2025, C.C.NO. 44 / 2023
Between
B. Pushpa Rekha ...Complainant
And
1. Kamasai Munirathnam Reddy, S/o Muni Reddy,
2.Kamasi Divya Maram, W/o Munirathnam Reddy, Plot No. 71, Gajalakshmi Nagar, Tirupati ...Respondents

పై కనిన కేసులో బత్తల పుష్పరేఖ అను ఆమె మీ మీద కన్స్యూమర్ ఫోరం తిరుపతిలో కేసు వేసి ఉంటున్నది. సదరు కేసులు 1 మరియు 2 ప్రతివాదుల నోటీసుల నిమిత్తం వాయిదా తేది. 08-10-2025 ఉదయం 10.30 గంటలకు నేరుగా హాజరై లేదా వకీలు ద్వారానైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెల్పుకోవలసినది. లేనియెడల సదరు కేసును పరోక్షముగా తీర్మానించబడును.
వాయదా తేది.08-10-2025
ఇట్లు,
బత్తల మురళిమోహన్,
కంప్లయింటు తరపున న్యాయవాది
తిరుపతి, సెల్ నెం.9490446068

27న జాబ్ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 తేదీన శనివారం ఉదయం 8 గంటల నుంచి తిరుపతి రూరల్ వేదాంతపురం లోని డాక్టరు ఆర్‌సిరెడ్డి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్ లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతి యువకుల కోసం ఈఎంసి క్లస్టర్, శ్రీ సిటీ , తిరుపతి, చెన్నైలోని 11 బహుళ జాతీయ కంపెనీలలో 450 పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. జిల్లాలోని పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా ఐటిఐ లేదా డిప్లమా లేదా ఏదైనా డిగ్రీలో లేదా పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులు అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ, యువకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్లు 7013509543, 9988853335 ను సంప్రదించ చాలన్నారు.

ఘనంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవతగా విరాజిల్లుతున్న మూలస్థాన ఎల్లమ్మ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం రాత్రి పెద్దశేష వాహనంపై కొలువై మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు రక్షణ భాగ్యం కల్పించారు. అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పాలు పెరుగు తేనె నెయ్యి పసుపు కుంకుమ కొబ్బరి నీళ్ల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి స్నపన తిమంజనం, అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టు పీతాంబరాలు, బంగారు నగలు ధరింపజేసి మహాలక్ష్మి అలంకరణలో పెద్దశేష వాహనంపై కొలువు తీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు, ఉభయ దాత జె డబ్ల్యు విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ :

విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పోషణ మా' కార్యక్రమం భాగంగా వడమాలపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భర్తలకు కూడా పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ డెమో నిర్వహించి, వారిని ప్రోత్సహిస్తూ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్ బి గీతాంజలి, సచివాలయం అంగన్‌వాడీ కార్యకర్తలు, బ్లాక్ కోఆర్డినేటర్ బిపివో అశోక్, గర్భిణులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడిసి డైరెక్టర్‌గా

గజేంద్ర ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- వీ కోట:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వీకోటకు చెందిన గజేంద్ర ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. వీకోటకు చెందిన గజేంద్రను రాష్ట్రడైరెక్టర్‌గా నియమించారు. వారి ప్రమాణస్వీకార కార్యక్రమానికి వీకోట నుండి అభిమానులు, శ్రేయోభిలాషులు భారీగా తరలి వెళ్లి వారిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గేయం రంగనాథ్, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ ధీరజ్, చైర్మన్ హరినాథ్‌రెడ్డి, బైరెడ్డిపల్లి మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరయ్య, చందు, వెంకీ, నరేష్, రవి, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు

ప్రజాశక్తి- పెద్దపంజాణి:

మండలంలో జరుగుచున్న వెక్టరైజేషన్ స్పెషల్ డ్రైవ్ స్వామిత్వ కార్యక్రమును జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు, సర్వేయర్లకు ఈ సర్వే పూర్తి చేయాలన్నారు. డీపీవో మాట్లాడుతూ డ్రోన్ సర్వేల ద్వారా లభించిన కచ్చితమైన మ్యాప్‌ల ఆధారంగా, గ్రామాల అభివృద్ధికి సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించవచ్చు, ఈ పథకాన్ని జిల్లాలో విజయవంతం చేయడానికి, పంచాయతీలన్నీ క్రియాశీలకంగా పాల్గొనాలన్నారు. ప్రతి ఇంటికి సర్వే వివరాలను తెలియజేసి, అవసరమైన పత్రాలను సమర్పించడంలో వారికి సహాయపడాలన్నారు. వెక్టరైజేషన్ ప్రక్రియ జాగ్రత్తగా సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. మండలంలో స్వామిత్వ కార్యక్రమం కోసం 15మంది సర్వేయర్లకు విధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, వారందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎండిఓ బాలాజీ, ఈఓఆర్డీ శారదా దేవి, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పవర్‌లూమ్, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కృతజ్ఞతలు తెలుపుకు న్నారు. అసెంబ్లీ లో క్వశ్చన్ అవర్‌లో పవర్ లూమ్ కార్మికులు, చేనేతలు తరపున ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కృతజ్ఞతలు తెలపుకున్నారు. విద్యార్థులకు ఏకరూప పదుస్తులు(యూనిఫామ్)2019-2024 మధ్య కొనుగోలు, పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. తయారీ ఆర్డర్, పవర్ లూమ్ , చేనేత సొసైటీలకు ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆప్కో సొసైటీ ద్వారా పవర్ లూమ్, చేనేత సొసైటీలకు ఆర్డర్ లు ఇస్తే వారికి ఉపాధి కల్పించవచ్చని ఎమ్మెల్యే ప్రభుత్వానికి సూచించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ తయారీ ఆర్డర్ ఇచ్చే అంశం పై సాధ్యాసాధ్యాలను శాసనసభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2019-2024 మధ్య జరిగిన కొనుగోలు, పంపిణీలో అవినీతిపై ఫిర్యాదులు అందాయని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.

మాట్లాడుతున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పారిశుధ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: పరిశుభ్రమైన గ్రామాలతోనే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదులు నిర్మించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర రావు అన్నారు. మండలంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను మండల అభివృద్ధి కార్యాలయంలో సమీక్షించారు. ప్రతిరోజూ వీధులను, కాలువలను శుభ్రం చేయాలని, పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఇంటికీ చెత్త సేకరణ వాహనాలు చేరుకునేలా చూడాలని, పారిశుధ్య ప్రాముఖ్యతపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల్లో ఉన్న శానిటేషన్ సిబ్బంది పనితీరును సమీక్షించి, వారికి అవసరమైన వనరులు, శిక్షణ అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కెవిన్.బాలాజీ, డిప్యూటీ ఎంపీడీఓ శారదాదేవి, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేదలకు అభివృద్ధి ఫలాలు అందించాలి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: నిరుపేదలను గుర్తించి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసి పేదరిక నిర్మూలనకు కృషి చేద్దామని ఎంపీడీవో రెడ్డప్ప అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయ సమూదాయంలో మండలంలో సచివాలయ ఉద్యోగులకు పి4 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన చేయాలనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన మార్గదర్శకులతో సమన్వయం చేసుకొని నిరుపేదలకు అభివృద్ధి ఫలాలను అందించేందుకు అందరూ ఉద్యోగస్తులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవన్.బాలాజీ, డిప్యూటీ ఎంపిడిఓ శారదాదేవి, శిక్షకులు మధుసూదన్, శ్రీజ, సచివాలయం ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత అంబులెన్స్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు లయన్స్ క్లబ్ వారు నియోజకవర్గ ప్రజల వైద్య అవసరాల నిమిత్తం ఉచిత అంబులెన్స్ వాహనం నేట 'నుండి అందుబాటులో తీసుకొని వచ్చినట్లు లయన్ సత్యకుమార్ తెలియజేశారు. లయన్స్ క్లబ్ పలమనేర్ వారిచే నిర్వహించబడుతున్న ఉచిత అంబులెన్స్ గత నెలరోజులుగా ఎఫ్‌సి ఇన్సూరెన్స్ కారణం చేత వాడుకలో లేదన్న విషయం పాఠకులకు విదితమే. గురువారం నుండి ఉచిత అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, డ్రైవర్, డీజిల్ ఖర్చులు మాత్రం భరించుకోవాలని తెలిపారు. చిత్తూరు, వేలూరు, తిరుపతి, కుప్పం, బెంగళూరు వరకు ఆక్సిజన్ సౌకర్యం కలదని, ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సౌకర్యం కోసం 9848576544 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీవీ పాఠశాల గుర్తింపు రద్దుపై ఆందోళన

ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో పీవీ పాఠశాల గుర్తింపు రద్దుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యాసంవత్సరం మధ్యలో పాఠశాలను రద్దు చేయడం ఎంత వరకు సమంజసం అంటూ వాపోయారు. పాఠశాలలో 147మంది విద్యార్థులు చదువుతున్నారని, 20 సంవత్సరాల పాటు ఉచిత విద్య, వసతిని అందిస్తు ఉన్న పాఠశాల గుర్తింపు రద్దు చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా 62 మంది అశ్వస్థతకు గురైన విషయమై యాజమాన్యానికి సంబంధం లేదని ఎంఈవో, డీవైఈవోలకు తెలిపామన్నారు.

శ్రీకల్యాణ వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న దృశ్యం

అట్టహాసంగా శ్రీ కల్యాణ వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 18 వ వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 6గంటల మధ్య ఆగమోక్తంగా జరిగిన ధ్వజారోహణంతో ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ధ్వజారోహణ కార్యక్రమం కన్నులపండవగా సాగింది. ముందు స్వామి వారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభానికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన వస్త్రంపై గరుత్మంతుణ్ణి లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అష్టదిక్పాలకులను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే దీని లక్ష్యం. శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు బుధవారం రాత్రి 7.30 నుండి 10 గంటల వరకు పెద్దశేష వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, చెవిరెడ్డి లక్ష్మీ కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారె సమర్పణ

బ్రహ్మోత్సవాలలో తొలిరోజున పెద్దశేష వాహనానికి పాకాల మండలం నుంచి భక్తులు స్వచ్ఛందంగా సారె తీసుకువచ్చి సమర్పించారు. మండలంలోని దామలచెరువు, ఉప్పరపల్లి, పెద్దరామాపురం, కొత్త వడ్డేపల్లి, మొగరాల, రమణయ్య గారిపల్లి, గానుగపెంట, ఇ.పాలగుట్ట పల్లి, వల్లివేడు, పేరసానిపల్లి, మద్దనాయునిపల్లి, పదిపుట్లబైలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి సారెను సమర్పించారు.

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఓయువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన తిరుపతిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా రాజంపేటకు చెందిన సతీష్‌కుమార్ (32) తిరుపతి రిలయన్స్ ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్ పక్కనే హత్యకు గురైనట్లు స్థానికులు పేర్కొన్నారు. బుధవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మద్యం బాటిల్ పగలగొట్టి గొంతు కోసినట్లు వుందని స్థానికులు ఆరోపించారు. జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది పాత్ర కీలకం: ఎంపీడీవో

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన పి4 కార్యక్రమం విజయవంతం కావాలంటే, సచివాలయ సిబ్బంది కీలకమైన పాత్ర పోషించాల్సిన అవసరముందని ఎంపీడీవో చంద్రశేఖర రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన 19 సచివాలయాల సిబ్బంది పి 4పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు విజయ, పవన్, సర్వే ప్రక్రియను వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా పి4 సర్వే, ఎలాంటి డేటా ఎంట్రీ వంటి అంశాలపై సిబ్బందికి పరిపాలనాధికారి ఆనందబాబు తెలిపారు.